



వేములపల్లి శంకరరావు

క్రైన్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

రామ్మూర్తి ఉత్సాహంగా డ్యూటీ దిగాడు. ఒకో డ్యూటీ ఎక్కే వేళావిశేషం డబ్బులు బాగా మిగుల్తుంటాయి. ఈసారి డ్యూటీలో కూడా అలాగే జరిగింది. ఆసామి మామూళ్లతో పాటు, పాసింజెర్ల డబ్బులుకూడా దండిగా తగిలాయి. ఓ పల్లెటూరు నుంచి హైదరాబాద్‌కు అరటిపళ్ల లోడ్ ఎత్తుతుంటే, ఆ ఆసామి 'మీ పిల్లలకు పట్టుకెళ్లవయ్యా' అని ఓ గెల లారీలో విడిగా పెట్టించాడు.

ఆఫీస్‌లో బిల్లులు అప్పజెప్పి, రావలసిన డబ్బులు తీసుకుని ఎదురుగా కాకాహోటల్‌లో దూరాడు రామ్మూర్తి క్లీనర్ కుర్రాడు వెంటరాగా. టీకి ఆర్డర్ చెప్పి బల్లపై కూర్చున్నాడు. లాటరీ టిక్కెట్లు అమ్మేవాళ్లు రామ్మూర్తి చుట్టూ చేరిపోయారు. రామ్మూర్తి డ్యూటీ దిగాడంటే వాళ్లకి పండుగే. పదీ, ఇరవైదాకా లాటరీ టికెట్లు తెగుతాయి. లాటరీ టిక్కెట్లయితే కొంటాడు గాని, ఫలితాలు చూస్తాడా అంటే అదీలేదు. ఆ వేళకు డ్యూటీలోనో, ఇంట్లో నిద్రలోనో ఉంటాడు. అలా కొన్న పాత లాటరీ టిక్కెట్లు ఇంట్లో ఓ పెద్ద కట్ట అయ్యాయి. ఏదో రోజున తనకు లాటరీ తగుల్తుందనీ, ఆ డబ్బుతో ఏకంగా లారీ కొందామని అతని మనసులో ఓ చిన్నకల. ఓ పది లాటరీ టిక్కెట్లు కొని వాళ్లను పంపేశాడు. లేచి టీ డబ్బుల్తోపాటు, పోయినసారి డ్యూటీ దిగినప్పుడు చేసిన బాకీ డబ్బులు ఇచ్చేశాడు. అలాగే బడ్డీకొట్టు దగ్గరకెళ్లి, అక్కడ పాత బాకీ కట్టేసి ఇంటికి రిక్షా మాట్లాడుకున్నాడు. క్లీనర్ కుర్రాడు అరటిపళ్ల గెలని రిక్షాలో పెట్టాడు. క్లీనర్ కుర్రాడు కూడా రిక్షాలో కూర్చున్నాడు. దోవలో మటన్ షాపు దగ్గర ఆపి కేజీ మాంసం కట్టించుకుని ఇంటికి చేరేసరికి ఆరయింది.

క్లీనర్ కుర్రాడు అరటిపళ్ల గెలని వరండాలో పెట్టాడు. రిక్షాలోంచి దిగుతున్న రామ్మూర్తిని చూసి పిల్లలు "హేయ్ ! నాన్నొచ్చాడు... నాన్నొచ్చాడు" అంటూ సంతోషంతో గెంతులు వేశారు. రిక్షా అబ్బాయిని పంపించేశాక, క్లీనర్ కివ్వాల్సిన డబ్బులు చేతిలో పెట్టాడు. క్లీనర్ కళ్ళు సంతోషంతో మెరిశాయి. మిగిలిన డ్రైవర్లు ఇచ్చేదాని కన్నా ఏబయ్యో, వందో ఎక్కువే ఇస్తాడు రామ్మూర్తి. అందుకే క్లీనర్ కుర్రాళ్ళు రామ్మూర్తి డ్యూటీ ఎక్కడానికి పోటీ పడ్తుంటారు.

"ఓ పదో, పదిహేనో నువ్వుంచుకొని మిగిలినవి మీ అమ్మకిచ్చేయి. సినిమాలూ, షికార్లని తిరక్కు, శుభ్రంగా నిద్రపో" చెప్పాడు. క్లీనర్‌తో గెలలో కాసిన్ని అరటి పళ్ళు కోయించి సంచిలో పెట్టి ఇచ్చాడు.

"వచ్చే డ్యూటీలో కూడా నన్నే తీసుకోవాలన్నా, పుల్లారావు నీ డ్యూటీలో ఎక్కాలని తెగచూస్తున్నాడు." సంచి తీసుకుని, ఇంటికెళ్లబోతూ చెప్పాడు క్లీనర్ కుర్రాడు.

"సరే, సరే," అంటూ మంచం మీద కూర్చున్నాడు రామ్మూర్తి. "ఇవిగోమ్మా, పోయినసారి గాజులూ, రిబ్బన్లూ కొనుక్కుంటామన్నారుగా, రేపు మీ అమ్మను తీసుకెళ్లి కొనుక్కోండి" అని ఇద్దరు ఆడపిల్లలకు చెరో ఇరవై రూపాయలిచ్చాడు. ఆ డబ్బుని వాళ్ల అమ్మ చేతికి ఇచ్చారు.

కాలేజీలో ఇంటర్ చదువుతున్న పెద్దకొడుకుని పిలిచి పాతిక రూపాయలిచ్చాడు. కాలేజి కుర్రాడు కదా! ఖర్చులుంటాయి అనుకుంటూ.

తన ఖర్చులకి ఓ ముప్పై వుంచుకుని మిగిలిన డబ్బులు భార్య చేతికిచ్చాడు. "ఈసారి డ్యూటీ బావుంది. కొంచెం డబ్బులు మిగిలాయి" అంటూ.

ఆమె కూడా చేతికి నిండుగా తగిలిన డబ్బుని చూసి సంతోషపడింది. వంటగదిలో కెళ్లి పొయ్యిమీద వేణ్ణీళ్ళు పెట్టింది. రామ్మూర్తి తలంటు పోసుకుని వచ్చి, కాస్త విశ్రాంతి తీసుకునే వేళకు అన్నం, కూర వుడికాయి. అందరూ ఒకేసారి భోజనానికి కూర్చున్నారు.

"ఈసారి డ్యూటీ లో పెద్దగండం తప్పింది. జగ్గయ్యపేట దాటాక ఎదురుతా వస్తున్న లారీ ని తప్పుకునేసరికి రోడ్డుకి అడ్డంగా సడెన్‌గా మేకపిల్ల వచ్చింది. దాన్ని తప్పిద్దామని పక్కకు తిప్పేసరికి ఎదురుగా చెట్టు. గుద్దుకునే వాణ్ణే, సడెన్‌గా బ్రేక్ వేశాను. ఎట్లాగో ఆగింది" చెప్పాడు భార్యతో.

వెంటనే మెడలో మంగళ సూత్రం తీసుకొని కళ్లకద్దు కుందామె. పిల్లలు ఆ దృశ్యాన్ని ఊహించుకొని "నాన్నకెంత గండం తప్పిందో" అనుకుని భయపడ్డారు.

భోజనాలయ్యాయి. పెద్దకొడుకు తల దువ్వుకుని సెకెండ్‌షోకి జయబాధురి నటించిన 'గుడ్డి' సినిమాకు బయల్దేరాడు. ఆ అబ్బాయికి జయబాధురి సినిమాలంటే తగనిపిచ్చి.

ఆ తరువాత రెండు రోజులూ భార్యా, పిల్లలకు ఉత్సాహంగా గడచిపోయాయి. డ్యూటీ చేసి వచ్చాడేమో పగలల్లా నిద్రపోతూనే వున్నాడు రామ్మూర్తి.

మూడోరోజు, బజారుకెళ్తూ జేబులు వెతుక్కున్నాడు రామ్మూర్తి. డబ్బుల్లేవు. భార్యను పిలిచి 'డబ్బులేమైనా వున్నాయా' అని అడిగాడు. ఆ డబ్బా, ఈ డబ్బా వెదికి చివరికి ఓ ఐదు రూపాయలు భర్త చేతికిచ్చింది. 'ఇంట్లో ఇవే వున్నా'యంటూ. నాలుగోరోజు ఉదయం ఈరోజు లారీ వుంటే డ్యూటీ ఎక్కాలి అను కుంటూ స్నానం చేస్తున్నాడు రామ్మూర్తి. "అమ్మా! నాన్న డ్యూటీ ఎప్పుడెక్కుతాడే" పెద్ద కొడుకు మాటలు వినిపించాయి. నీళ్ళు పోసు కుంటూ ఎత్తిన చెంబు చేతిలోనే ఆగి పోయింది. ఒక్క క్షణం అచేతనంగా నిల్చుండి పోయాడు రామ్మూర్తి. పెద్దకొడుకు కాలేజికి వెళ్లిపోయాడు.

స్నానం ముగించి బట్టలేసుకొని నెమ్మదిగా లారీ ఆఫీస్ కేసినడిచాడు. ఆఫీసులో కనుక్కుంటే లారీ సాయంత్రాని కొస్తుంది. ఆ రాత్రికి డ్యూటి ఎక్కొచ్చన్నారు ఆఫీసువాళ్లు. కాకాహోటల్ కెళ్లాడు. టిఫిన్ చేయబుద్ది కాలేదు. టీ తాగి, సిగరెట్ వెలిగించుకుని, దగ్గర్లోని మెకానిక్ షెడ్‌లోకి నడిచాడు. పాతటైర్ల మీద కూర్చున్నాడు. అతడి చెవుల్లో "అమ్మా నాన్న డ్యూటీ ఎప్పుడెక్కుతాడే?" అన్న పెద్దకొడుకు మాటలే పదే పదే గింగురుమంటున్నాయి. మనసుకు ముల్లు గుచ్చుకున్నట్టు బాధ వేస్తోంది.

సహజంగా ఏ ఉద్యోగస్తుల పిల్లల కయినా పగలు ఎట్లా గడిచినా సాయంత్ర మయ్యే సరికి తండ్రి కనపడాలని కోరు కుంటారు. పనిమీద తమ తండ్రి రెండ్రోజులు ఏదయినా ఊరెళ్తే విలవిలలాడిపోతారు. కానీ, తన కొడుకు మాత్రం – తను డ్యూటీ దిగి నాలుగురోజులు ఇంట్లో వుండే సరికి, మళ్ళీ నాన్న డ్యూటీ ఎప్పుడు ఎక్కుతాడో, ఎప్పుడు డబ్బులు తెస్తాడో అని అనుకుంటున్నాడు 'చిత్రం' అనుకున్నాడు రామ్మూర్తి. అతనికి ఎదురుగా పాతలారీ కన్పించింది. అదిబాగా పాతబడి, శిధిలమై పోయివుంది. ఈ లారీ మంచి కండీషన్‌లో వున్నప్పుడు డ్యూటీ డ్యూటీకి పూలదండలు వేసి, నిమ్మకాయలు కట్టి, పసుపు కుంకుమలు పూసి, కొబ్బరికాయలు కొట్టి వుంటారు. మైళ్ళకు మైళ్ళు తిరిగి, పార్టులన్నీ పాడై పోగా షెడ్‌లోకి చేరిన ఈ లారీని ఇప్పుడు ఎవరు పట్టించు కుంటారు?

రామ్మూర్తికి ఎందుకో ఆలారీకి తనకూ పోలిక వున్నట్టు అనిపించింది. జేబు నిండా డబ్బుతో డ్యూటీ దిగే తనకు లాటరీ టిక్కెట్లు అమ్మేవాళ్లు, కాకాహోటల్ ప్రొప్రయిటర్, బడ్డీ కొట్టుఓనర్ సంతోషంతో స్వాగతంపలుకుతారు. ఇంట్లో భార్యాపిల్లలు తన రాకకు సంతోషిస్తారు.

నాలుగురోజులు గడిచాక, చేతిలో డబ్బులయి పోయాక, నాన్న మళ్ళీ ఎప్పుడు డ్యూటీ ఎక్కుతాడా అని ఎదురుచూస్తారు.... బాధగా నిట్టూర్చాడు రామ్మూర్తి.

---

**చినుకు**

**పదిలైన్లకు మించని అణువుల్లాంటి మినీకవితలకు స్వాగతం.**


**దృఢమైన, నమ్మకమైన, సమయానుగతమైన కార్యాచరణే భవన నిర్మాణ రంగంలో మమ్మల్ని విజేతల్ని చేసింది**

**అందమైన ఆధునిక గృహ నిర్మాణాలకోసం సంప్రదించండి**

**పి. జగన్మోహన్ రావు**
**ఇంజనీర్స్ & ఆర్కిటెక్ట్స్**

**విజేత కనస్ట్రక్షన్స్**

డో. నెం. 27-19-22, శ్రీనివాస హోటల్ ఎదురుగా, మొదటి అంతస్థు, దుర్గయ్య వీధి
గవర్నర్‌పేట, విజయవాడ, సెల్: 9393445559, ఫోన్: 2577525